# తగ్గేదే లేదట..!

- పోటీలోనే ఉంటామంటున్న భంగపాటు నేతలు
- అసంతృప్తి సెగలతో కాలుతున్న కాంగ్రెస్సు
- పశ్చిమంలో నేనే : జంగా
- వర్ధన్నపేట టికెట్ నాదే : నమిండ్ల
- అసంతృప్తిలోనే ఇనుగాల, ఎర్రబెల్లి
- వరంగల్ తూర్పు, మానుకోటలోనూ ఇదే తీరు
- హుస్నాబాద్‌లో స్వతంత్రంగా పోటీకి అల్గిరెడ్డి సిద్ధం!?




భీమదేవరపల్లి : వాట్సాప్‌లో వైరల్ అవుతున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి లోగో

వరంగల్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్‌లో టికెట్ల లొల్లి ఇంకా ముదురుతూనే ఉన్నది. టిక్కెట్ దక్కని నేతలు తగ్గేదే లేదంటున్నారు. కచ్చితంగా పోటీలో ఉంటామని తెగేసి చెబుతున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం జాబితాలో తమ పేరు లేకున్నా బీఫారం మాత్రమే తమకే దక్కుతుందని గట్టిగా చెబుతున్నారు. కాంగ్రెస్ రెండు జాబితాల్లో టిక్కెట్ దక్కని నాయకులు, పార్టీ అధిష్ఠానంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇన్నాళ్లు పార్టీ కోసం పని చేసిన తమకు అన్యాయం చేశారని, అప్పటికప్పుడు పార్టీలో చేరిన వారిని అభ్యర్థులుగా ప్రకటించారని ఆగ్రహంతో ఉన్నారు. రెండో జాబితా వచ్చిన రోజు నుంచి అసంతృప్త నేతలు తమ అనుచరులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. ఎన్నికల్లో తమ వ్యూహం అమలుపై ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. వరంగల్ పశ్చిమం, పరకాల, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, మహబూబాబాద్, హుస్నాబాద్ సెగ్మెంట్లలో అసమ్మతి రోజురోజుకూ పెరుగుతున్నది. వరంగల్ పశ్చిమంలో కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి భంగపడ్డ డీసీసీ మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి సొంతంగా బలం చాటేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తన సేవలను గుర్తించలేదని, అక్రమార్కులకు అవకాశం ఇచ్చిందని మండిపడుతున్నారు. రెండు రోజులుగా అనుచరులు, కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. వరంగల్ పశ్చిమంలో పోటీ చేస్తానని తెగేసి చెబుతున్నారు. ఒక్క రోజు ముందు చేరిన వారికి, పార్టీ సభ్యత్వం లేని వారికి టిక్కెట్లు ఇవ్వడంతో కాంగ్రెస్ క్యాడర్‌లో ఆత్మస్థయిర్యం దెబ్బతిన్నదని చెబుతున్నారు. ప్రజల మద్దతుతో వరంగల్ పశ్చిమ సెగ్మెంట్‌లో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని అనుచరులతో అంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా చూసిన తర్వాత ఉమ్మడి జిల్లాలోని ఆరు సీట్లలో ఎన్నికలకు ముందే పార్టీ ఓడిపోయినట్లయిందని, మిగిలిన సీట్లలోనూ పోటీ ఇచ్చే పరిస్థితిలో లేదని చెబుతున్నారు. జంగా వరంగల్ పశ్చిమంలో బరి లో నిలవాలని అనుచరుల నుంచి ఒత్తిడి వస్తున్నది. పూర్తి స్థాయిలో సంప్రదింపుల అనంతరం తన నిర్ణయాన్ని బహిరంగా ప్రకటిస్తానని అనుచరులతో అంటున్నారు.

**ఆరని మంటలు..**

కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన తర్వాత పరకాల, పాలకుర్తి, మహబూబాబాద్, వరంగల్ పశ్చిమం, హుస్నాబాద్ సెగ్మెంట్లలో సీనియర్ నేతలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. పదేండ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్న తనను కాదని కాంగ్రెస్ సభ్యత్వం లేని రేవూరి ప్రకాశ్‌రెడ్డికి టిక్కెట్ ఇవ్వడంపై ఇనగాల వెంకట్రాంరెడ్డి నారాజ్‌లో ఉన్నారు. అభ్యర్థుల రెండో జాబితా ప్రకటించిన తర్వాత రోజు నియోజకవర్గంలోని అనుచరులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. పార్టీ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి తనను కలిసేందుకు ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదు. రెండోరోజు నుంచి సన్నిహితులతో చర్చలు జరుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించేది లేదని ఇనగాల అనుచరులు చెబుతున్నారు. పాలకుర్తిలో కాంగ్రెస్ టిక్కెట్‌ను పార్టీతో ఎలాంటి సంబంధం లేని వారికి ఇచ్చారని ఆ పార్టీ నేత ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి అసంతృప్తితో ఉన్నారు. భారతదేశ పౌరసత్వం లేని ఝాన్సీరెడ్డికి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇవ్వాలని చూసిందని, ఇది సాధ్యం కాదని తెలిసిన తర్వాత పార్టీకి సంబంధంలేని ఝాన్సీరెడ్డి కోడలు యశస్విని అభ్యర్థిగా ప్రకటించిందని తిరుపతిరెడ్డి వాపోతున్నారు. కాంగ్రెస్‌లో పని చేసిన వారికి గుర్తింపు దక్కే పరిస్థితి లేదని అంటున్నారు. వర్ధన్నపేట కాంగ్రెస్ టిక్కెట్ విషయంలో పార్టీ అధిష్ఠానం తప్పుడు నిర్ణయం తీసుకున్నదని పీసీసీ ప్రధాన కార్యదర్శి నమిండ్ల శ్రీనివాస్ అన్నారు. రెండో జాబితాలో తన పేరు లేకున్నా బీఫారం తనకే వస్తుందని చెప్పారు. వర్ధన్నపేటలో ఎక్కువ సంఖ్యలో ఉన్న వర్గాలను విస్మరించి కాంగ్రెస్ పార్టీ తప్పు చేస్తున్నదని నమిండ్ల అనుచరులు చెబుతున్నారు. వరంగల్ తూర్పు సెగ్మెంట్‌లో కొండా సురేఖకు టిక్కెట్ ఇవ్వడంపై అభ్యర్థిత్వం ఆశించిన నేతలు ఆగ్రహంతో ఉన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం మార్చుకోవాలని, లేకుంటే పార్టీ అభ్యర్థికి సహకరించేది లేదని స్పష్టం చేస్తున్నారు. మహబూబాబాద్ టిక్కెట్ రాకపోవడంతో అసంతృప్తితో ఉన్న కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, రాష్ట్ర నేత బెల్లయ్యనాయక్ అసంతృప్తితోనే ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నియోజకవర్గానికి వచ్చి ప్రచారం మొదలుపెట్టినా వీరిద్దరూ దూరంగానే ఉంటున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం మార్చుకోవాలని ఇద్దరు నేతలు కోరుతున్నారు. హుస్నాబాద్ టిక్కెట్ దక్కని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి సొంతంగా పోటీ చేయాలని అనుచరులు ఒత్తిడి తెస్తున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం మోసం చేసిందని, నియోజకవర్గంతో సంబంధంలేని వ్యక్తికి టిక్కెట్ ఇచ్చి గెలవలేని పరిస్థితి తెచ్చిందని అంటున్నారు. బీఫారం ఇచ్చే సమయంలో అయినా అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.



హసన్‌పర్తి : సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

## సభ్యత్వమే లేని వారికి టికెట్టా?

- ఏండ్ల నుంచి ఉన్న వారికి కాకుండా రెండు నెలల క్రితం వచ్చిన వారికి ఎలా ఇస్తారు?
- వర్ధన్నపేట సెగ్మెంట్‌పై కాంగ్రెస్ అధిష్ఠానం పునరాలోచించాలి
- లేకపోతే కార్యకర్తల నిర్ణయం మేరకు కార్యాచరణ ప్రకటిస్తా..
- కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నమిండ్ల శ్రీనివాస్

హసన్‌పర్తి, అక్టోబర్ 30 : వర్ధన్నపేట ఎమ్మెల్యే టికెట్‌పై కాంగ్రెస్ అధిష్ఠానం పునరాలోచించాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నమిండ్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోమటిపల్లిలోని ఆయన నివాసంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా 13 సంవత్సరాలు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశానని, నియోజకవర్గానికి చేసిన పని చూసి ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీలో సభ్యుడిగా ఎన్నుకున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఐదు సంవత్సరాలు పనిచేసిన వారికి టికెట్ ఇవ్వాలి గానీ, పార్టీ సభ్యత్వమే లేని వారు, రెండు నెలల క్రితం వచ్చిన వారికి టికెట్ ఎలా ఇస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం పార్టీ కోసం ప్రజల మధ్య ఉండి పని చేసిన నాకు టికెట్ ఇచ్చే అర్హత లేదా? అని ప్రశ్నించారు. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం పునరాలోచించాలని కోరారు. కోట్లు సంపాదించిన వారికి టికెట్ ఇస్తారా? ఇప్పటికైనా పునరాలోచించాలని, లేకపోతే పార్టీ కార్యకర్తల నిర్ణయం మేరకు కార్యాచరణ ప్రకటిస్తానని స్పష్టం చేశారు.

## పత్తి ధర @ రూ.7,130

కాశీబుగ్గ, అక్టోబర్ 30 : ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పత్తి ధర క్వింటాల్‌కు రూ.7130 ధర పలికింది. భారత ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020 ఉన్నది. సంగెం మండలంలోని నార్లవాయి గ్రామానికి చెందిన కుసం స్వామి 21 పత్తి బస్తాలు తీసుకువచ్చారు. మొగిలి పెద్ద కొమురయ్య అడ్తి ద్వారా గోకుల్ కాటన్ ఖరీదు వ్యాపారి కొనుగోలు చేశారు. మార్కెట్‌కు 5,772 బస్తాలు వచ్చినట్లు పత్తియార్డు సూపర్‌వైజర్ గంగాధర్ తెలిపారు. అత్యధికంగా రూ.7130, మధ్య రకానికి రూ.7,100, కనిష్ఠంగా రూ.5,600 పలికినట్లు తెలిపారు.

## ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

**న్యాయం చేయాలని యువతి వేడుకోలు**



లక్నవరంలో శ్రీధర్‌తో ప్రవంతి దిగిన సెల్ఫీ(ఫైల్)

ములుగు రూరల్, అక్టోబర్ 30 : నాలుగేళ్ల ప్రేమాయణం అనంతరం పెండ్లి మాట ఎత్తేసరికి మొహం చాటేయగా, ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు బైఠాయించిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. బాధిత యువతి దుబ్బ ప్రవంతి తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం మండలం ఎక్కలకు చెందిన సదరు యువతి పస్రా ఫారెస్టు పరిధిలో లింగాల బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నది. అక్కడే బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ములుగు మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ సాంబయ్య కుమారుడు మంకిడి శ్రీధర్, ప్రవంతి నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల శ్రీధర్‌ను పెండ్లి చేసుకోమని కోరగా, మొహం చాటేశాడు. ఈ విషయంపై పలు మార్లు అడిగినా సమాధానం రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 29న పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీకి తేదీ ఖరారు చేయగా, శ్రీధర్ రాకపోవడంతో సోమవారం ఉదయం ములుగులోని శ్రీధర్ ఇంటి ఎదుట బైఠాయించినట్లు తెలిపింది. విషయం తెలుసుకున్న ములుగు ఎస్సై వెంకటేశ్వర్ ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించగా, ప్రవంతి తన బంధువులతో కలిసి ములుగు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది.

## పటాకుల దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

సుబేదారి, అక్టోబర్ 30 : తాత్కాలికంగా పటాకుల విక్రయ కేంద్రాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని, స్థల యజమాని అంగీకార పత్రసనిరని చెప్పారు. హనుమకొండ అదాలత్ ఎస్‌బీఐలో రూ.800 ప్రభుత్వ ఖజానా పేరుతో చలాన్ చెల్లించాలని, వచ్చే నెల 6వ తేదీ వరకు డీసీపీలకు దరఖాస్తులను అందజేయాలని అందులో పేర్కొన్నారు.

## పరీక్షలు రాసినా గైర్హాజరు..

- దూరవిద్యా కేంద్రం బీకాం కంప్యూటర్స్ ల్యాబ్ పరీక్షల్లో ఆబ్సెంట్
- ఆందోళనలో విద్యార్థులు..


హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 30 : విద్యార్థులు పరీక్షలకు హాజరైనప్పటికీ కాకతీయ విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారులు గైర్హాజరు వేసి ఫెయిల్ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధిత విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన పలువురు విద్యార్థులు కేయూ దూరవిద్యా కేంద్రంలో బీకాం కంప్యూటర్స్ చివరి సంవత్సరం పరీక్షలు రాశారు. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు జరిగిన ల్యాబ్ పరీక్షలకు హాజరైనా ఆబ్సెంట్ వేసి ఫెయిల్ చేశారు. విద్యార్థులు కేయూ వెబ్‌సైట్‌లో పరీక్షా ఫలితాలను చూసుకొని లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. కాగా, తాను హాజరైనట్లుగానే విశ్వవిద్యాలయానికి పంపించానని పేపర్లు చూపించారు. వెంటనే కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆరెల్లి నరేందర్‌కు ఫోన్‌లో విషయం తెలుపగా, 'అందంతా నాకు తెలియదు.. మీ కాలేజీ అధ్యాపకులకే తెలియాలి.' అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. మరుసటి రోజు ఫోన్ చేయగా 'అప్‌డేట్ కాలేదని.. మెమోలు కాలేజీకి వచ్చిన తర్వాత చూసుకోవాలని లేదంటే ఇక్కడికి వచ్చి చూసుకోవాలి' అని చెప్పినట్లు విద్యార్థులు చెప్పారు. ఈ విషయంపై పరీక్షల నియంత్రణాధికారి ఎం మల్లారెడ్డిని వివరణ కోరగా, కొన్ని సాంకేతిక కారణాల వల్ల పొరపాట్లు జరుగుతాయని దాటవేశారు.

**ఇటీవల కూడా ఇలాంటి ఘటనలే జరిగాయి. వాటిలో కొన్ని..**

1. ఇటీవల విడుదల చేసిన ఆరో సెమిస్టర్ ఫలితాల్లో పరీక్ష రాసిన కొందరికి గైర్హాజరు వేసి ఫెయిల్ చేశారు. ఇలా ఎందుకని ప్రశ్నిస్తే సాంకేతిక సమస్య అని, మళ్లీ సరిచేసి పంపించారు.
2. బీఎల్ఐఎస్సీలో పాసయ్యేందుకు ఓ రెగ్యులర్ ఉద్యోగి, పరీక్షల విభాగంలో పనిచేసే ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులు ఏకంగా ఆన్సర్ బుక్‌లెట్లు మార్చివేశారు. ఈ ఘటనపై ఇప్పటికీ విచారణ కొనసాగుతుండడం విశేషం.
3. గతంలో 100కు 150 మార్కులు వచ్చినట్లు మెమోలో చూపించారు.

## వ్యవసాయ కనెక్షన్లను త్వరగా మంజూరు చేయాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు

హనుమకొండ సబర్బన్, అక్టోబర్ 30 : వ్యవసాయ సర్వీసుల మంజూరు వేగవంతం చేయాలని అధికారులకు టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ విద్యుత్ భవన్ కార్యాలయంలో జనగామ, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ వర్క్ ఆర్డర్స్ పూర్తి చేయాలని, 33/11కేవీ బ్రేక్‌డౌన్స్, ట్రిప్పింగ్స్‌ను తగ్గించాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు పెంచాలని, విధిగా లైన్ల పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. సబ్‌స్టేషన్ల నిర్వహణ చేపట్టాలని, ఉద్యోగులు హెడ్ క్వార్టర్లలో ఉండి విధులు నిర్వర్తించాలని సూచించారు. టీఎస్ఐపాస్, ధోబీఘాట్, నాయీబ్రాహ్మణ, లాండ్రీ షాపుల సర్వీసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. వినియోగదారులతో సంఖ్యతగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, గణపతి, తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్‌కుమార్, సదర్‌లాల్, మోహన్‌రావు, కిషన్, అశోక్, బీకంసింగ్, జీఎంలు, డీఈఐటీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## బీఎస్పీ అభ్యర్థుల ఖరారు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో పేర్లు వెల్లడి

సుబేదారి, అక్టోబర్ 30 : రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం 39 మందితో రెండో విడుత జాబితా ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొత్తం 12 అసెంబ్లీ స్థానాలకు గాను ఎనిమిది సెగ్మెంట్లలో అభ్యర్థుల పేర్లను ఖరారు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్–తాళ్లపల్లి వెంకటస్వామి, పాలకుర్తి– సింగారం రవీందర్ గుప్తా, డోర్నకల్–గుగులోత్ పార్వతీనాయక్, నర్సంపేట–డాక్టర్ గుండాల మదన్‌కుమార్, వరంగల్ తూర్పు–చిత్రపు పుష్పలయ, వర్ధన్నపేట–డాక్టర్ వడ్డేపల్లి విజయకుమార్, ములుగు–భూక్యా జంపన్ననాయక్, మహబూబాబాద్–గుగులోత్ శంకర్‌నాయక్ అభ్యర్థిత్వాన్ని ఫైనల్ చేశారు.